# గురువు - ఒక దేశ నిర్మాత

గురువును దైవంగా పూజించే సాంప్రదాయం మన భారత దేశానిది. విద్య, వివేకం, విలువలు నేర్పి ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్ది, దేశ నిర్మాణంలో అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తున్నది గురువులే.



"ఆటలతో అక్షరాలను నేర్పించడం ఆరంభించి

పాటలతో పాఠాలు బోధించడం ప్రారంభించి

ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో గుణింతాలతో చూపించి

జీవితంలో పైకి ఎలా ఎక్కాలో గణితంలో లెక్కలు వేసి

మన జీవితంలో చేసే క్రియలకు, మన మనుగడకు వృక్ష, జల, జీవరాసులే మకరందం అని చెప్పి అందరికీ ప్రకృతిని వికృతిగా వినాశనం చేయవద్దని ఇలా ఎన్నో శాస్త్రాలను అస్త్రాలుగా చేసి విద్యార్థుల అమ్ముల పొదిలోకి శిలా శాసనం రూపంలో చేరుస్తున్న గురువులు ఎందరో.



"గు" అంటే గుహ్యామైనది, తెలియనిది, అజ్ఞానమని అర్ధం.

"రు" అంటే తెలియపరిచేది, జ్ఞానమని అర్ధం. గురువు అంటే మనలోని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానమనే దీపాన్ని వెలిగించేవాడని అర్ధం.

దేవుడు ,గురువు పక్కపక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తాను అన్నారు కబీర్దాస్. ఎందుకంటే ఆయన భగవంతుడు అని తెలియజేసింది నాకు గురువే కాబట్టి అని వివరించారు.



**దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుడు పాత్ర :**

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించడం ద్వారా దేశ భవిష్యత్తు నిర్మించే ప్రధాన బాధ్యత ఉపాధ్యాయుడిది కాబట్టి ఉపాధ్యాయుడి ప్రవర్తన, చేసే పనులు విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగానూ, మార్గదర్శకంగానూ ఉండాలి. ఎన్నో అసమానతలతో, మూఢనమ్మకాలతో, పేదరికంతో పోరాడటానికి ఇంకా భారతదేశాన్ని శక్తివంతమైన మరియు విజ్ఞానాభివృద్ధి కలిగిన దేశంగా మార్చగల సామర్థ్యం మరియు బలం ఒక్క ఉపాధ్యాయుడికే ఉంది. సంఘ నిర్మాణంలో కీలక పాత్ర ఉపాధ్యాయులదే.



మొదట తల్లిదండ్రుల చాటున ఉన్న పిల్లలను కొన్ని గంటల పాటు వారికి దూరంగా భిన్నమైన వాతావరణాన్ని పరిచయం చేసి జీవితంలో ఎదుర్కోబోయే సవాళ్లకు సంసిద్ధులను చేయడంతో ప్రారంభమైన ఉపాధ్యాయుల పని, ఆ పిల్లలు భవిష్యత్తులో మంచి వ్యక్తిత్వంతో, జీవనశైలిని కలిగి ఉండేలా ప్రభావితం చేస్తారు. చాలామంది పిల్లలు ఉపాధ్యాయులను అనుకరించి వారినే ఆదర్శంగా తీసుకుంటారు. ఉపాధ్యాయులు నిస్వార్థంగా తమ దగ్గర చదువుకునే పిల్లలందరిని నిన్నటి కంటే తెలిపైన వారిగా మార్చడానికి తనకు తెలిసిన సమాచారాన్ని నిరంతరం వారికి అందించడానికి ప్రయత్నిస్తారు.



ఉపాధ్యాయుడు ఒక తత్వవేత్త, మార్గదర్శి మరియు

స్నేహితుడిగా ఉండాలి.



.



కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయుడు మరింతగా ముందుకు వెళ్లి పిల్లలు సమస్యల్లో ఉంటే భుజం తట్టి నేనున్నానని సమస్యను పరిష్కరించి ఒక స్నేహితుడిగా స్నేహ హస్తాన్ని అందివ్వాలి. ఉపాధ్యాయుల జీవిత సారాన్ని రంగరించి తన అనుభవాల ద్వారా విద్యార్థులకు జీవిత సత్యాన్ని గురించి బోధించి చెప్పాలి. తద్వారా పిల్లలు జీవిత పాఠాలు నేర్చుకుంటారు. జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు ,సమస్య పరిష్కార నైపుణ్యం మొదలైనవి అన్ని తమ జీవితాలకు

అన్వయించుకుని మంచి నడవడికను పెంపొందించుకొని తద్వారా సమాజంలో మంచి పౌరులుగా ఎదుగుతారు.



తమ దగ్గర చదువుకునే విద్యార్థుల కుటుంబ నేపథ్యం అంటే వారి ఇంట్లో తండ్రి తాగుబోతుగా ఉండవచ్చు లేదా తల్లి,తండ్రి విడిపోయి ఉండొచ్చు. అలాంటి పిల్లల ఆలోచన విధానం మరియు వారి శక్తి సామర్థ్యాలపై పూర్తి అవగాహన ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుంది. కాబట్టి ఉపాధ్యాయుడు వీటన్నిటి మధ్య సమతుల్యతను సాధిస్తూ పిల్లల భవిష్యత్తును చెడు

వైపు కాకుండా మంచివైపు ప్రభావితం కావడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాడు.



సాధారణ ఉపాధ్యాయుడు సమాచారాన్ని ఇస్తాడు. జిజ్ఞాస గల ఉపాధ్యాయుడు జ్ఞానాన్ని ఇస్తాడు. ఉత్తమ ఉపాధ్యాయుడు స్ఫూర్తిని ఇస్తాడు. నిరంతరం జ్ఞానాన్ని పెంపొందించుకుంటూ ఆ విజ్ఞానాన్ని విద్యార్థులతో పంచుకుంటూ, విద్యార్థులలో ఉత్తమ విలువలను ,జీవన నైపుణ్యాలను నేర్పి వారి జీవిత వికాసానికి తోడ్పాటును అందించే గురువులందరూ దేశం  అన్ని రంగాలలో

అభివృద్ధి చెందుతూ విజ్ఞానాభివృద్ధిని సాధించడంలో తమ వంతు పాత్రను పోషిస్తారు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు .

దేశ భవిష్యత్తు తరగతి గదిగోడల మద్యే తయారవుతుంది.







ఉపాధ్యాయుడు విద్యార్థులు ఆలోచన ధోరణి పెంచేవిధంగా పాఠాలు బోధించాలి. ఉపాధ్యాయుడికి తన సబ్జెక్టు పట్ల,సమాజం పట్ల అవగాహన ఉండాలి. ఒకటవ తరగతి నుండి తోటి విద్యార్థులతో ఎలామెలగాలి, సహాయపడే గుణం, అబద్దాలు చెప్పకూడదు,తోటి విద్యార్థులపై చాడీలు చెప్పకూడదు,తల్లి తండ్రులను,పెద్దవారిని గౌరవించడం వంటి విలువలు తో కూడిన జీవితాన్ని విద్యార్థులకు అలవాటు చేసి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్ది తద్వారా దేశ నిర్మాణానికి ఉపాధ్యాయుడు సహాయపడతారు.





పిల్లల తల్లితండ్రుల సమావేశాలు తరచుగా నిర్వహించి ,

విద్యార్థులు పురోగతి గురించి తెలియజేయడమే కాకుండా

పిల్లల తల్లితండ్రుల బాధ్యతను తెలియజేసి వారిలోని

మూఢనమ్మకాలను రూపుమాపి , సమాజం పట్ల , పాఠశాల

పట్ల వారిని  బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్ది

దేశనిర్మాతలుగా ఉపాధ్యాయులు అవతరిస్తారు.






నిన్నటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పర్యావరణ రక్షణ పట్ల వారి బాధ్యతను వివిధ కృత్యాల ద్వారా తెలియజేస్తారు.






బాల్యవివాహాలు జరిపించడం ద్వారా అమ్మాయిలు  ఎలాంటి సమస్యలు ఎదుర్కుంటారో తల్లితండ్రులకి వివరించడం ద్వారా అమ్మాయిలు తమకాళ్ళ మీద తాము నిలబడేలా మంచి సమాజ నిర్మాతలుగా ఎదగడానికి దోహదం చేస్తారు.పాఠశాలలో అన్ని పండుగలు నిర్వహించడం, కుల,మత భేదం లేకుండా అందరిని సమాన దృష్టితో చూడటం  ద్వారా భిన్నత్వం లో

ఏకత్వ సాధన మరియు మన భారతదేశ సంస్కృతి ,
సంప్రదాయాలను గౌరవించడాన్ని విద్యార్థులలో పెంపొందించి విలువలతో కూడిన భారత దేశాన్ని నిర్మించగలుగుతారు.

ప్రాణాలు కాపాడే డాక్టర్ అయినా చట్టాన్ని కాపాడే పోలీస్ అయినా దేశానికి అధినేత అయిన పెద్ద పెద్ద బవంతులు రూపకల్పన చేసే ఇంజనీర్ అయిన ఏ వృత్తిలోని వారైనా సరే ఒక ఉపాధ్యాయుని దగ్గర విద్యను అభ్యసించినవారే. గురువు స్థానం చాలా గొప్పది మరియు బాధ్యతాయుతమైన స్థానం.ఉపాధ్యాయుడు ఇంటా ,బయట అందరికీ ఆదర్శంగా ఉంటూ విద్యా ప్రమాణాలను, జీవన విలువలను పాఠాలతో మిళితం చేసి బోధించాలి.విద్యార్థుల మనసులో నాటుకు పోయి విధంగా మహనీయుల చరిత్రలు చెప్పాలి .

మా పాఠశాలలో నేను సాధించిన విద్యార్థి వైఖరిలోని మార్పు:

నేను చిత్తూరు జిల్లా, పెద్దపంజాణి మండలం ,రాయలపేట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నాను. మా పాఠశాలలో ఒకటవ తరగతి విద్యార్థి

పేరు ధనుష్. ధనుష్ ఎప్పుడూ ఎవరితోటి కలవకుండా ముభావంగా ఉండేవాడు. ఏది చెప్పినా వినేవాడు కాదు, ఎంతసేపు నిద్రపోతూ మిగిలిన పిల్లలు ఆడుకోవడానికి వెళ్ళినప్పుడు వారి బ్యాగుల్లోని  వస్తువులను దొంగతనం చేసేవాడు. కానీ ఏవైనా ప్రశ్నలు అడిగినప్పుడు సమాధానం మాత్రం బాగా చెప్పేవాడు. అరే ఈ అబ్బాయి పాఠాలు సరిగ్గా వినకపోయినా సమాధానం బాగా చెప్తున్నాడు, ధనుష్ లో టాలెంట్ ఉందని గుర్తించి ధనుష్ టాలెంట్ ని ఎంకరేజ్ చేస్తూ ధనుష్ ఏది చెప్పినా పిల్లల దగ్గర అభినందించడం, నువ్వు చేయగలవు , ఏ పనైనా బాగా చేయగలవు అంటూ ధనుష్ ని ప్రోత్సహిస్తూ ధనుష్ ఏ చిన్న పని చేసినా అభినందిస్తూ అతన్ని దగ్గరికి తీసుకొని పలకరిస్తూ ప్రేమగా పలకరిస్తూ ఉండడం వల్ల ధనుష్ వైఖరిలో చాలా మార్పు వచ్చింది .తోటి విద్యార్థులు అందరితోటి ధనుష్ ని కలిపి అతనితోపాటు నేను కూడా ఆడుకుంటూ పిల్లలందరితో ఆడుకుంటూ ఉండటంవల్ల కొద్ది రోజుల్లోనే ధనుష్ లో చాలా మార్పు వచ్చి పిల్లలందరితో కలవడం ,విద్యార్థుల బ్యాగుల్లోని వస్తువులను దొంగతనం

చేయడం తప్పని తెలుసుకుని చాలా బాగా మారాడు .అలా మారడమే కాకుండా పాఠశాల వార్షికోత్సవం రోజు ఆంగ్లంలో అందరి ముందు ప్రసంగించాడు. గ్రామస్తులు ఒకటవ తరగతిలో ఇంత బాగా ఆంగ్లంలో ప్రసంగించాడని ధనుష్ ని మెచ్చుకొని ధనుష్ కి వెయ్యి రూపాయల బహుమానాన్ని కూడా ప్రకటించడం జరిగింది. ఇప్పుడు ధనుష్ మూడవ తరగతి చదువుతున్నాడు .చాలా బాగా చదువుతున్నాడు. చదువులోనే కాకుండా ఆటల్లోనూ, పాటల్లోనూ చాలా చురుకుగా ఉంటున్నాడు .ఇంకా నాయకత్వ లక్షణాలను కలిగి తన లాగే ఇంకొంత మందికి చదువులో సహాయం చేస్తున్నాడు. అతనిలో వచ్చిన మార్పును చూసి  నాకు చాలా సంతోషం కలిగింది. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పిస్తే ప్రతి విద్యార్థి మంచి పౌరులుగా తయారయి తద్వారా భారతదేశ నిర్మాణం లో భాగస్వామి కాగలరు.